క్లుప్తంగా

వారపు సంతలో అన్నదానం



పాకాల: పాకాలలోని వారపు సంతలో సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు అన్నదానం చేశారు. నాయకులు మాట్లాడుతూ సంతలో కూరగాయలు అమ్మడానికి వచ్చే రైతులు, వ్యాపారులు భోజనానికి ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో భోజనాలు ఏర్పాటు చేశారని తెలిపారు.

పరిశీలన గృహం తనిఖీ



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి

తిరుపతి లీగల్: మంగళంలోని బాలుర పరిశీలన గృహాన్ని సోమవారం తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి తనిఖీచేశారు. అలాగే బాలుర ప్రత్యేక హోమ్‌ను జడ్జి పరిశీలించి అక్కడ అందుతున్న వసతుల గురించి ఆరా తీశారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ షణ్ముఖరావు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

పాకాల: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి డిమాండ్ చేశారు. ఆమె సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్వేచ్ఛ, సమానత్వం కలిగిన దేశంలో మహిళలను నగ్నంగా ఊరేగించడం అమానుషమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు.

అరణ్యపర్వం పారాయణం ప్రారంభం

తిరుమల: తిరుమల నాదనీరాజనం వేదికపై జరుగుతున్న మహాభారత ప్రవచనాల్లో భాగంగా సోమవారం రాత్రి అరణ్యపర్వం పారాయణం ప్రారంభమైంది. తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆచార్యులు పవన కుమార శర్మ ప్రవచనం వినిపించగా, అతిథి అధ్యాపకులు డాక్టర్ భరద్వాజ శర్మ శ్లోకపారాయణం చేశారు. ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకురాలు కె.వందన శ్రీకృష్ణ సంకీర్తనలను రాగయుక్తంగా గానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రతిరోజూ రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కెఎస్ఎస్.అవధాని తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ కల్యాణ్‌కుమార్‌కు డాక్టరేట్



డాక్టరేట్, దైవజ్ఞ రత్న అవార్డులు అందుకుంటున్న కృష్ణ కల్యాణ్‌కుమార్, చక్రధర్

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన పారిశ్రామికవేత్త కృష్ణ కల్యాణ్‌కుమార్‌కు డాక్టరేట్, జ్యోతిష్య పండితుడు చక్రధర్‌కు దైవజ్ఞ రత్న అవార్డులు లభించాయి. హైదరాబాద్‌లోని విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జ్యోతిష్య సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల్ దీక్షితుల చేతుల మీదుగా కృష్ణకల్యాణ్‌కుమార్‌కు డాక్టరేట్, చక్రధర్‌కు దైవజ్ఞ రత్న అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధినేత విశ్వనాథ్, కంచికామకోటి ఆస్థానం పండితుడు విజయసుబ్రమణ్యం సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తిరుపతి కల్చరల్: సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యుడు ముర్రంశెట్టి రాములు ఆధ్వర్యంలో సోమవా రం తెలంగాణ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని అలిపిరి వద్ద పేదలకు అన్నదానం చేశారు. సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వికాస్, ఏపీ ఆర్యవైశ్య మహాసభ సోషల్ మీడియా చైర్మన్ యశస్వీతేజ, రాజ్ మనోహర్, దుర్గ పాల్గొన్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న ట్రాక్టర్

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం తొండవాడ బ్రిడ్జి వద్ద సోమవారం బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తి తీవ్ర గాయపడ్డాడు. తొండవాడకు చెందిన శ్రీను తిరుపతికి వెళ్లి తిరిగి బైక్‌లో ఇంటికి వస్తున్నాడు. తొండవాడ వద్ద ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108 లో రుయా ఆస్పత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదరణను చూసి ఓర్వలేకే విమర్శలు

- వచ్చే ఎన్నికల్లో జగనన్నకే ప్రజల ఓట్లు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- 7వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: దేశం మెచ్చేలా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేకే ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, డివిజన్ అధ్యక్షుడు చిమట రమేష్‌తో కలిసి 7వ డివిజన్ కొర్లగుంటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి వారు పొందిన ప్రభుత్వ పథకాలు, లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇంత మేలు చేసిన జగనన్నను వచ్చే ఎన్నికల్లో ఆదరించి మళ్లీ గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో ఎవరూ అందించలేనన్ని సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గత ప్రభుత్వంలో ఎవరికైనా చిన్నపాటి సంక్షేమాన్ని అందించావా చంద్రబాబు అని ప్రశ్నించారు. ప్రజలకు ఏనాడూ మేలు చేయని నీకు ప్రజలు ఎందుకు ఓటు వేయాలని అని నిలదీశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, టి.మునిరామిరెడ్డి, రామస్వామి వెంకటేశ్వర్లు, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, దేవదానం, బుసగాని లక్ష్మయ్య, టౌన్ బ్యాంకు డైరెక్టర్ కాసీమ్, కంకణాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక కట్టడాల పునరుద్ధరణను టీటీడీ నడుంబిగించాలి



కృష్ణమనాయని కుంట పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష తదితరులు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిన పురాతన కట్టడాలను పరిరక్షించేందుకు టీటీడీ నడుం బిగించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కోరారు. ఆయన సోమవారం మేయర్ శిరీష, కమిషనర్ హరిత, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, ఇతర ఇంజినీర్లతో కలిసి చెన్నారెడ్డి కాలనీలోని పురాతన కృష్ణమనాయుని కుంట నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో శ్రీవారి నడకమార్గం భక్తుల కోసం చెన్నారెడ్డి కాలనీ, అలిపిరి సమీపంలో రెండు తాగునీటి కుంటలు నిర్మించారన్నారు. అవి శిథిలావస్థకు చేరినట్టు తెలిపారు. కృష్ణమనాయుని కుంట పునరుద్ధరణ చర్యలు చేపట్టామన్నారు. అలిపిరి సమీపంలోని కుంట అభివృద్ధి బాధ్యతల్ని టీటీడీ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ సీఈ నాగేశ్వరరావు, కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, స్థానిక కార్పొరేటర్ పునీత పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత చెవిరెడ్డి



తిరుమలనగర్ వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీడీవో వెంకటనారాయణ



సీమల్లవరంలో ఆరోగ్య పరీక్షలకు తరలివస్తున్న స్థానికులు

తిరుపతి రూరల్: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన నియోజకవర్గ ప్రజల కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఆరోగ్య ప్రదాతగా నిలిచారని దుర్గసముద్రం సర్పంచు మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం, బ్రాహ్మణపట్టు, తిరుమలనగర్, సీమల్లవరం పంచాయతీల్లో సోమవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. సర్పంచు మాట్లాడుతూ 42 రకాల పరీక్షలను ఉచితంగా చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరాలకు హాజరైన వారికి మోహిత్‌రెడ్డి సొంత నిధులతో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం అందజేశారు. తిరుపతి రూరల్ ఎంపీడీవో వెంకటనారాయణ వైద్య శిబిరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచులు మొక్కల భారతి, ప్రసాద్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, వకుళ పాల్గొన్నారు.

పంచాయతీ పార్టీ అధ్యక్షుల నియామకం



మహేశ్వర్‌రెడ్డి



భాస్కర్‌రెడ్డి



శ్రీరాములు రెడ్డి



చెన్న

పాకాల: మండలంలోని పలు పంచాయతీలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులను నియమిస్తూ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సామిరెడ్డిపల్లికి మహేశ్వర్‌రెడ్డి, పాకాల–1కి భాస్కర్‌రెడ్డి, కె.వడ్డేపల్లికి శ్రీరాములు రెడ్డి, పంటపల్లికి చెన్న నియమితులయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలని వారికి ఎమ్మెల్యే సూచించారు.

మహాకవి గుర్రం జాషువాకు ఘన నివాళి



మహాకవి గుర్రం జాషువాకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

తిరుపతి కల్చరల్: మహాకవి గుర్రం జాషువా వర్ధంతిని సోమవారం వైఎస్సార్ సీపీ నేతలు లక్ష్మీపురం సర్కిల్‌లో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సమసమాజ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు గుర్రం జాషువా అని కొనియాడారు. డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే. బాబు, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, తిరుపతి జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రావూరి ప్రసాద్‌బాబు, ఎస్సీ, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు రంగస్థలి నివాళి

రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శికే ఎన్.రాజా, వెంకట్రామయ్య, సుబ్రమణ్యంరెడ్డి, కేశవులురెడ్డి పాల్గొన్నారు.

సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో..

తిరుపతి కల్చరల్: సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ భవన్‌లో మహాకవి గుర్రం జాషువ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలోని మూఢ నమ్మకాలు, అన్యాయంపై గుర్రం జాషువ తన రచనలతో ప్రజల ను చైతన్యవంతం చేశారని తెలిపారు. పరమశివన్, పుష్పరాజ్, వీసీకే పార్టీ నేత అంకన్న, చిరంజీవి, రాధాక్రిష్ణ, కేశవులు, రజిని, సుబ్బు, రాజేష్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నగరిలో జాబ్‌మేళా రేపు

నగరి : ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కాల్ మన్ సర్వీసెస్ సెంటర్ చెన్నై వారి సంయుక్తంగా బుధవారం టెలికాలర్ ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన, ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ చదువుతున్న వారు అర్హులన్నారు. నెలకు రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం, ఉచిత వసతి సదుపాయం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మార్క్ లిస్ట్ జిరాక్స్, ఒరిజినల్ ఐడీ ప్రూఫ్‌తో ఈ నెల 26వ తేదీ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు జేకేసీ ఫుల్ టైం మెంటార్ లాల్‌బాషాను గానీ, కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ పార్థసారథిని 9884787264 నంబరుకు, కంపెనీ యూనిట్ హెడ్ ధనరాజ్‌ను 9884304026లో సంప్రదించాలన్నారు.

మణిపూర్ ఘటన పైశాచిక చర్య

- బీజేపీ నిరంకుశ పాలనకు తార్కాణం
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



బర్దన్ కమ్యూనిటీ భవన్‌ను ప్రారంభిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

తిరుపతి కల్చరల్: మణిపూర్ ఘటన పైశాచిక చర్య అని, దీనిపై నరేంద్రమోదీ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. ఆయన సోమవారం తిరుపతిలోని ఏటీ బర్దన్ కాలనీలో బర్దన్ కమ్యూనిటీ భవన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మణిపూర్‌లోని కొండ ప్రాంతంలో గిరిజనులు నివాసం ఉంటున్నారని తెలిపారు. అక్కడ మంచి విలువలు, సంపద కలిగిన భూములు ఉన్నాయని తెలిపారు. వాటిని కొల్లగొట్టడానికి బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలిపారు. ఇప్పటికే ఆ భూముల్లో ఆదానికి 54 వేల ఎకరాలను అప్పగించిందన్నారు. దీనికి అడ్డుపడుతున్న గిరిజనులపై మరో వర్గాన్ని రెచ్చగొట్టి అల్లర్లు సృష్టిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల ముందే కార్గిల్ సైనికుడి భార్య, బిడ్డపై లైంగిక దాడి చేశారని, అడ్డుకున్న కొడుకుని చంపేశారని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం దారుణమన్నారు. అలాంటి బీజేపీతో చేతులు కలిపి రాజకీయ ఆత్మహత్య చేసుకోవాలనుకునే టీడీపీ, జనసేన చేతులు కాలిపోవచ్చన్నారు.

4 నుంచి రాయలసీమ ఆర్గానిక్ మేళా

తిరుపతి కల్చరల్/తిరుపతి అర్బన్ : రైతు సాధికార సంస్థ, ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం సంయుక్తంగా ఇస్కాన్ రోడ్డులోని టీటీడీ మైదానంలో ఆగస్టు 4 నుంచి 6వ తేదీ వరకు రాయలసీమ ఆర్గానిక్ మేళా–2023ను నిర్వహించనున్నట్టు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కుమారస్వామి తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆర్గానిక్ మేళా కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయానికి ఆదరణ పెరిగిందన్నారు. మార్కెటింగ్ చేసుకోవడానికి ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఆర్గానిక్ మేళా చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు అమ్మకాలు చేపడతామన్నారు. ఆగస్టు 3వ తేదీ ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి కాంప్లెక్స్ నుంచి టీటీడీ మైదానం వరకు ఆరోగ్య పరుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయ పరిశోధకులు గంగాధరం, నిర్వాహకులు ధనుంజయరెడ్డి, మనోహర్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ బాధితులకు తాగునీటి సౌకర్యం కల్పించండి



వీల్‌చైర్స్‌ను అందజేస్తున్న కలెక్టర్, రెడ్ క్రాస్ ప్రతినిధులు

తిరుపతి అర్బన్: జిల్లాలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. ఆయన సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా ఫ్లోరైడ్ బాధితులకు వీల్ చైర్స్‌తోపాటు రిహాబిలిటేషన్ ఎక్విప్‌మెంట్ అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ డాక్టర్ కిరణ్ నాయక్, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ డాక్టర్ ప్రణీత్, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు అనుమతి ఇవ్వాలని వినతి



ఎస్ఎస్.రావత్‌కు వినతిపత్రం కేతం జయచంద్రారెడ్డి, వేమూరి జ్యోతిప్రకాష్

తిరుపతి మంగళం: తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంకు నుంచి మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి రాష్ట్ర ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఎస్.రావత్‌ను కోరారు. ఆయన సోమవారం విజయవాడలోని సెక్రటరేట్‌లో ఎస్ఎస్.రావత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ టౌన్ బ్యాంకు ఆధ్వర్యంలో రూ.వందల కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. ఖాతాదారులకు ఎంతో మెరుగైన సేవలందిస్తున్నామని తెలిపారు. పొదుపు సంఘాల మహిళలకు రుణాలు ఇచ్చి మెరుగైన సేవలందించేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఎస్ఎస్.రావత్ తెలిపినట్లు కేతం జయచంద్రారెడ్డి తెలిపారు. టౌన్ బ్యాంకు డైరెక్టర్ వేమూరి జ్యోతిప్రకాష్, మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్- 2023 పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి అర్బన్: గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్–2023 పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీపీవో రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛతకు తీసుకోవాల్సిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీపీవోకు సూచించారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

రామచంద్రాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ సభ్యుడు శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం కమ్మపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రోగుల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు అందుబాటులో ఉంటారని, వారి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యుడు మురుగేషన్, పీహెచ్‌సీ వైద్యాధికారి హేమలత, డాక్టర్ భరద్వాజ్, ఎంపీటీసీ రాజేష్ పాల్గొన్నారు.

భూమన కుటుంబానికి రుణపడి ఉంటా



ఎమ్మెల్యే కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న సునీల్‌చక్రవర్తి

తిరుపతి మంగళం: బలిజలకు ఉన్నత పదవులు కల్పిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటానని రాష్ట్ర రవాణా శాఖ సభ్యుడు ముత్తంశెట్టి సునీల్‌చక్రవర్తి తెలిపారు. ఆయన సోమవారం తిరుపతి పద్మావతిపురంలో ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేని కలిసి సత్కరించారు. తనకు పదవి రావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్ నరసింహ ఆచారి, ఇరుగుశెట్టి నరేంద్ర, సెల్వకుమార్ పాల్గొన్నారు.

30న కార్మిక, కర్షక రాష్ట్ర సదస్సు

తిరుపతి కల్చరల్: విజయవాడలో ఈ నెల 30న కర్షక, కార్మిక రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్, హేమలత తెలిపారు. వారు సోమవారం రైతు సంఘం కార్యాలయం వద్ద సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. వాటిని తక్షణం మానుకోవాలని, లేని పక్షంలో రాబోవు ఎన్నికల్లో అందరూ ఐక్యమై గద్దె దించుతామని హెచ్చరించారు. ప్రశ్నించే వారిపై దేశ ద్రోహం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా నడిపించి నెల రోజులు గడుస్తున్నా నిందితులపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నాలుగు కోడ్‌లుగా కుదించడం సిగ్గుచేటన్నారు. నేతలుహరీష్, బాలకృష్ణ, కేఎస్ఎస్.ప్రసాద్, రంగయ్య పాల్గొన్నారు.